



# కరపత్రం

SINCE 2014

సోమవారం ఫిబ్రవరి 03 2025 | సంపుటి :0 | సంచిక : 113 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి



మిగతాది 2లో

- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది.
- హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నేతలు, కార్యకర్తుల పాల్గొన్నారు.

## మోస్ట్ ఫ్రెండ్లీ బడ్జెట్ ఇది - ప్రధాని మోదీ



- ఈసారి దేశ రాజధానిలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు.

2లో

## జనగణన ఇంకెప్పుడు చేస్తారు?: భారాస ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: జనగణన ఇంకెప్పుడు చేస్తారని భారాస ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. ఈమేరకు ఆమె 'ఎక్స్' వేదికగా కేంద్రాన్ని నిలదీశారు. జనగణనను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యమవుతుందని అడిగారు. ప్రగతిశీల విధానాలకు ఆ వివరాలు తప్పనిసరని పేర్కొన్నారు.

2లో

## కులగణన, సామాజిక సర్వేలో 3.50 కోట్ల మంది వివరాలిచ్చారు



హైదరాబాద్: వెనుకబడిన తరగతులకు న్యాయం చేయాలనేదే తమ ఆకాంక్ష అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా రాష్ట్రంలో కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక అందజేశారు. కులగణన అంశంపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసిన అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ ఆశయం మేరకు రాష్ట్రంలో సామాజిక, కులగణన సర్వే చేపట్టామన్నారు.

## త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వ కారణం



- వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

హైదరాబాద్: వరుసగా రెండోసారి అండర్-19 మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న టీమిండియా జట్టును సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బిడ్డ గొంగడి త్రిషకు సీఎం.. ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మలేషియాలో సౌత్ ఆఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి ఇండియా జట్టు విశ్వవిజేతగా

2లో

## ఈనెల 15లోపే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్



- ఈనెల 15లోపే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఖమ్మం: ఫిబ్రవరి 15లోపే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన ఎన్నికలు వస్తున్నాయ్.. జాగ్రత్త అంటూ కార్యకర్తలకు సూచించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర కుటుంబ సర్వేపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల అంశం కూడా చర్చకు వచ్చింది. ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నామంటూ పంచాయతీరాజ్, ఎన్నికల సంఘం అధికారులు తెలిపినట్లు సమాచారం. కులగణన నివేదిక కేబినెట్ సబ్‌కమిటీకి ఆదివారం అందింది. దీనిపై కేబినెట్‌లో చర్చించాక.. 5న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి...

2లో

## యూట్యూబ్ వీడియోలు చూసి.. మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్ నేరాలు




హైదరాబాద్: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ అలియాస్ రాహుల్‌రెడ్డి నివాసంలో పోలీసులు తనిఖీలు చేయగా 428 తూటాలు దొరికాయని మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. నేరస్థుడు ప్రభాకర్‌ను విచారించగా.. అతను ఇచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తులో పోలీసులకు విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. డీసీపీ వినీత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

## కుంభమేళాకు 20 రోజుల్లోనే 33కోట్ల మంది.. వసంత పంచమి వేళ మరింత రద్దీ!



మిగతాది 2లో

- వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్న నేపథ్యంలో యూపీ ప్రభుత్వం మరింత అప్రమత్తమైంది.

## తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించలేదు.. బడ్జెట్ కేటాయింపుల విషయంలో పునరాలోచించండి




తెలంగాణకు నిధులు కేటాయించే విషయంలో అన్యాయం చేసిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అనేకసార్లు ఢిల్లీ వెళ్లిన ప్రతి సందర్భంలో ప్రధానిని.. కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణకు సాయం చేయాలని కోరినా ... బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు .. తెలంగాణపై రాజకీయ కక్ష ధోరణిని కేంద్రం కొనసాగించిందన్నారు. విద్యా పరంగా కాని.. ఎయిర్ పోర్టుల విషయంలో కాని.. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న ప్రాజెక్ట్ లకు నిధులను ఎందుకు కేటాయించలేదని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు.

2లో

## కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత బన్నీ వాసు

హైదరాబాద్: సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను నిర్మాత బన్నీ వాసు పరామర్శించారు. రెండు నెలలుగా సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీతేజ్‌కు అందుతున్న చికిత్స గురించి బన్నీ వాసు అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం విదేశాలకు తీసుకెళ్తామని చెప్పారు. శ్రీతేజ్ వైద్య ఖర్చులు భరిస్తామని తెలిపారు.
తొమ్మిదేళ్ల బాలుడు శ్రీతేజ్ దాదాపు రెండు నెలలుగా ఆసుపత్రికే పరిమితమయ్యాడు.

మిగతాది 2లో



# సంపాదకీయం

## ఉచితాల ఊబిలో 'రుణ భారతం'!

'తాకట్టులో భారతదేశం' అనే పుస్తకాన్ని వామపక్ష అతివాది తరిమెల నాగిరెడ్డి నాలుగున్నర దశాబ్దాల క్రితమే రాశారు. సిద్ధాంతాల ప్రాతిపదికన ఆయన అప్పట్లో 'ఇండియా మార్ట్‌గేజ్' పేరిట ఇంగ్లీషులో ఈ పుస్తకం రాశారు. తరిమెల నాగిరెడ్డి మరెవరో కాదు! మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి స్వయానా బావమరిది. శాసనసభ సభ్యుడిగా ఎన్నికైన ఆయన ఈ వ్యవస్థ పట్ల విరక్తితో తన రాజీనామాను ప్రకటిస్తూ శాసన సభలో చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకం. ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే... ఐదు దశాబ్దాల తర్వాత ప్రస్తుతం మన రాజకీయ పార్టీలు ఎన్నికల్లో విజయం కోసం చేస్తున్న హామీలు, ఉచితాల పేరిట ప్రకటిస్తున్న పథకాలను చూస్తుంటే నిజంగానే భారతదేశం తాకట్టులోకి వెళ్లడానికి ఎంతో కాలం పట్టదన్న భావన ఏర్పడుతోంది. ఢిల్లీ ఎన్నికల సందర్భంగా మూడు ప్రధాన రాజకీయ పార్టీలైన ఆమ్ ఆద్మీ పార్టీ, భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలు పోటీపడి మరీ ఉచితాలను ప్రకటిస్తున్నాయి. అప్పుచేసి పప్పు కూడు పెడతామని ఆర్భాటంగా చెబుతున్నాయి. ఏదో ఒక పార్టీ అధికారంలోకి రావడం కోసం ప్రజల నెత్తిన అప్పుల భారం మోపే హక్కు రాజకీయ పార్టీలకు ఎవరిచ్చారు? రాష్ట్రాలలో అధికారంలోకి వచ్చేందుకు ప్రాంతీయ పార్టీలతోపాటు జాతీయ పార్టీలు కూడా ఉచితాల విషయంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయి. ఉచితాలను అరికట్టే బాధ్యత తీసుకోవడానికి ఒక్క వ్యవస్థ కూడా ముందుకు రావడం లేదు. ఈ అంశం ఎన్నికల కమిషన్ చూసుకోవాలని సుప్రీంకోర్టు తప్పించుకుంటోంది. ఎన్నికల కమిషన్ కూడా తానేమీ చేయలేనని, రాజకీయ పార్టీలే స్వీయ నియంత్రణ పాటించాలని చేతులెత్తేస్తోంది. పులి మీద స్వారీ చేస్తున్న రాజకీయ పార్టీలు ఈ ఉచితాలకు ఎక్కడో ఒకచోట చెక్ పడాలని బలంగా కోరుకుంటున్నప్పటికీ ఆ పని మాత్రం తాము చేయలేమని చెబుతున్నాయి.

### సాధించిందేమిటి?

స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినప్పటికీ దేశంలో పేదరికం పెరిగిందనుకోవాలా? అభివృద్ధి జరగలేదని భావించాలా? అంటే తమ ఏలుబడిలో అభివృద్ధి బుల్లెట్ ట్రైన్‌లా పరుగులు తీసిందని ఇవే రాజకీయ పార్టీలు గొప్పలు చెప్పుకొంటున్నాయి. నిజంగా అభివృద్ధి జరిగితే ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి కదా? అలాంటప్పుడు ఉచితాల అవసరం ఏమిటి? అంటే సమాధానం దొరకదు. ఢిల్లీలో ఆప్ రెండు పర్యాయాలుగా అధికారంలో ఉంది. అయినా ఈ ఎన్నికల్లో మరిన్ని ఉచితాలు ప్రకటించారంటే తమ ఏలుబడిలో పేదరికం పెరిగిందని అంగీకరిస్తారా? ఉపాధి కోసం సమీప రాష్ట్రాల ప్రజలు దేశ రాజధాని ఢిల్లీకి వలస వస్తున్నారు. ఢిల్లీలో ఉపాధి లభించని పక్షంలో ఈ వలసలు ఉండవు కదా! అయినా నిరుద్యోగ భృతి ఇస్తామనడం ఏమిటి? పన్నుల రూపంలో ప్రజలు చెల్లించే డబ్బును దానకర్ణుల వలె పంచిపెట్టే అర్హత, హక్కు రాజకీయ పార్టీలకు ఉంటుందా? అంటే సమాధానం దొరకదు. ఢిల్లీ వార్షిక బడ్జెట్ 75 వేల కోట్ల రూపాయల వరకు ఉంటుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఒక్క రాజకీయ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే 40 వేల కోట్ల రూపాయలకు పైగా అవసరం. ఇదెలా సాధ్యం? అదేమంటే అప్పు చేస్తామంటున్నారు. మన రాజ్యాంగ నిర్మాతలు ఈ విపరీత పోకడలను ఊహించే కాబోలు రాష్ట్రాలు అప్పులు చేయడానికి కూడా పరిమితులు పెట్టారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్టుగా ఈ పరిమితులకు రాష్ట్రాలు తూట్లు పొడుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాలలో అనుకూల ప్రభుత్వాలు ఉన్నప్పుడు ఈ పరిమితులను పట్టించుకోకుండా అప్పులు చేసుకోనిస్తోంది. రాష్ట్రాలు మాత్రమే కాదు%-% కేంద్ర ప్రభుత్వం కూడా విచ్చలవిడిగా అప్పులు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పు ప్రస్తుతం కోటీ 81 లక్షల 74 వేల 284 కోట్లకు చేరింది. అంటే దాదాపు రెండు కోట్ల కోట్ల రూపాయలకు అప్పు పెరగబోతోంది. రాష్ట్రాలు చేసిన అప్పులు కూడా కలుపుకొంటే ఈ మొత్తం రెట్టింపు అవుతుంది. రాష్ట్రాలు అప్పుపాలై బలహీనపడితే కేంద్రం కూడా బలహీనమవుతుంది. ఇటు రాష్ట్రాలు, అటు కేంద్రం అప్పులు చేసుకుంటూ పోతే ఆ అప్పు ఎవరు తీర్చాలి? ఏదో ఒకరోజు దేశం దివాలా తీయదన్న గ్యారంటీ ఉందా? మన పొరుగున ఉన్న శ్రీలంకలో ఏం జరిగిందో చూశాం. ఒకప్పుడు సంపన్న దేశంగా ఒక వెలుగు వెలిగిన వెనెజువెలాలో ఉచితాల భారం పెరిగి ఇప్పుడు అక్కడి ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. పట్టెడన్నం కోసం పడుపు వృత్తి చేయడానికి కూడా వెనుకాడని దుర్భర పరిస్థితులున్నాయి. ఇప్పుడు మన దేశంలో ఎన్నికల సందర్భంగా ఇస్తున్న హామీలు అమలు చేసుకుంటూ పోతే ఈ అప్పులు రెట్టింపు అవడానికి ఎంతో సమయం పట్టదు.

### గెలిపించేది పథకమేనా?

ప్రతి ఎన్నికల్లో ఒక కొత్త పథకాన్ని రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్నాయి. ఎంత గొప్ప పథకమైనా దాని ప్రభావం ఒక ఎన్నికకు మాత్రమే పరిమితమవుతోంది. ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికలకు మరో కొత్త పథకం ప్రకటించాల్సిన పరిస్థితి. 1983లో తెలుగుదేశం పార్టీని ప్రారంభించిన ఎన్టీఆర్ రెండు రూపాయలకు కిలో బియ్యం ప్రకటించి అధికారంలోకి వచ్చారు.

## మోస్ట్ ఫ్రెండ్లీ బడ్జెట్ ఇది - ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి

దేశ చరిత్రలోనే అత్యంత ఫ్రెండ్లీ బడ్జెట్ ఇదేనని మధ్యతరగతి ప్రజలు చెబుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి.. రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి ఇంత ఉపశమనం ఎప్పుడూ లభించలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన ప్రచార సభలో తాజా బడ్జెట్‌ను ప్రస్తావిస్తూ ప్రధాని మోదీ ఈమేరకు ప్రసంగించారు. ఆప్‌ను ఢిల్లీకి ఆపదగా పేర్కొంటూ.. 'ఆప్-ద' ప్రభుత్వం 11 ఏళ్లు వృథా చేసిందని విమర్శించారు.

"నెహ్రూ కాలంలో ఎవరికైనా రూ.12 లక్షల జీతం ఉంటే.. అందులో పావువంతు పన్నుకే వెళ్లేది. ఒకవేళ నేడు ఇందిరా గాంధీ పాలన ఉంటే.. అదే జీతానికి రూ.10 లక్షలు పన్ను చెల్లించాల్సి వచ్చేది. 12 ఏళ్ల క్రితం కాంగ్రెస్ హయాంలో కూడా ఆ మొత్తానికి రూ.2.60 లక్షలు ట్యాక్స్‌గా పోయేది. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పేదలు, రైతులు, యువత, మహిళల సాధికారతకు మోదీ ఇచ్చిన గ్యారంటీలను ఈ బడ్జెట్ నెరవేరుస్తుందన్నారు.ఆప్ నేతలు పార్టీని వీడుతున్నారని, ప్రజల్లో పార్టీపై ఎంత ఆగ్రహం ఉందో వారు గ్రహించారని పేర్కొన్నారు. ఈసారి దేశ రాజధానిలో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. భాజపాపై కేజ్రీవాల్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తాము మురికివాడలను కూల్చేయబోమని, పథకాలను నిలిపివేయబోమని తెలిపారు. ఈనెల 8న కాషాయ పార్టీ విజయం సాధిస్తుందని, వచ్చే నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళలకు రూ.2500 పంపిణీ ప్రారంభిస్తామని చెప్పారు.

## తెలంగాణకు నిధులు ఎందుకు కేటాయించలేదు.. బడ్జెట్ కేటాయింపుల విషయంలో పునరాలోచించండి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతో ఉందని... ట్రాఫిక్ సంబంధించి అనేక సమస్యలున్నాయని.. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ను నిర్మించేందుకు కేంద్రం సహకారం కావాలని కోరినా పట్టించుకోలేదన్నారు. విద్యా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు ట్రిపుల్ ఐటీ,ఐఐటి, సైనిక్ కళాశాలలను తెలంగాణలో ఏర్పాటు చేసే విషయంలో కేంద్రం పునరాలోచించాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

## కుంభమేళాకు 20 రోజుల్లోనే 33కోట్ల మంది.. వసంత పంచమి వేళ మరింత రద్దీ!

మొదటిపేజీ తరువాయి

మహాకుంభమేళా నేపథ్యంలో వసంత పంచమి నాడు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భక్తులు పోటెత్తుతున్నారు. మౌని అమావాస్య రోజున చోటుచేసుకున్న తొక్కిసలాటతో అప్రమత్తమైన యూపీ సర్కార్.. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఎటువంటి తప్పిదం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి ప్రభుత్వం.. సీనియర్ ఐఏఎస్‌లను రంగంలోకి దింపింది.

జనవరి 13న కుంభమేళా ప్రారంభం కాగా.. ఫిబ్రవరి 1వ తేదీ వరకు ప్రయాగ్‌రాజ్‌లో సుమారు 33కోట్ల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం అంచనా వేసింది. శనివారం 2.15కోట్ల మంది రాగా.. ఆదివారం మధ్యాహ్నం 12గంటల వరకే 90లక్షల మంది భక్తులు స్నానాలు ఆచరించినట్లు తెలిపింది. వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం 4 నుంచి 6కోట్ల మంది రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు కుంభమేళాకు ప్రముఖుల తాకిడి కూడా పెరుగుతోంది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌కు వచ్చివెళ్లగా.. ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ రాక కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

అమెరికా జనాభాతో సమానంగా యాత్రికులు మౌని అమావాస్య రోజున కోట్లాది మంది ప్రయాగ్‌రాజ్ రావడం, సెక్టార్ 2లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది చనిపోయిన నేపథ్యంలో క్రౌడ్ మేనేజిమెంట్‌పై అధికారులు మరింత దృష్టి సారించారు. 2019లో అర్ధ కుంభమేళా సమయంలో పనిచేసిన ఐఏఎస్ అధికారులు అశీష్ గోయల్, భానుచంద్ర గోస్వామిలను రంగంలోకి దించారు. వీరిద్దరు మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్‌తో కలిసి పని చేయనున్నారు.

అదనపు డీజీపీ భాను భాస్కర్ కూడా రద్దీ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఘాట్‌లను పరిశీలించిన ఆయన.. స్నానాల తర్వాత ఘాట్‌ల వద్ద కాలక్షేపం చేయవద్దని సూచించారు. ఇతరుల కోసం ఆ ప్రదేశాన్ని ఖాళీ చేయాలని, ఘాట్‌ల వద్ద భోజనాలు చేయవద్దని చెబుతున్నారు. విశ్రాంతి కోసం భక్తులు నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లాలని మైక్‌లలో ప్రకటనలు చేశారు.

ఇదిలాఉంటే, కుంభమేళా సమయంలో సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమిలను పవిత్ర రోజులుగా భావిస్తారు. వీటితోపాటు మాఘ పూర్ణిమ (ఫిబ్రవరి 12), మహా శివరాత్రి (ఫిబ్రవరి 26) రోజుల్లోనూ అమృత స్నానం ఆచరించేందుకు కోట్లాది మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వచ్చే అవకాశం ఉంది.

## త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వ కారణం

మొదటిపేజీ తరువాయి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలానికి చెందిన త్రిష ఆల్ రౌండ్ ప్రతిభతో అద్భుత ఆటను ప్రదర్శించారు. దూకుడుగా ఆడి చివరి వరకు నిలబడి సత్తా చాటారు. టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచారు. త్రిష లాంటి క్రీడాకారులు తెలంగాణకు గర్వకారణమని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. త్రిష మరింతగా రాణించి భవిష్యత్తులో టీమిండియా సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవాలని ఆకాంక్షించారు. అద్భుతమైన క్రీడా నైపుణ్యమున్న యువతీ యువకులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని భరోసా ఇచ్చారు.

## కిమ్స్ ఆసుపత్రిలో శ్రీతేజ్‌ను పరామర్శించిన నిర్మాత బన్నీ వాసు

మొదటిపేజీ తరువాయి

అయినా బాలుడి ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. తొక్కిసలాట తర్వాత బాలుడిని పక్కకు తీసుకెళ్లిన పోలీసులు సీపీఆర్ చేశారు. వెంటనే సికింద్రాబాద్ కిమ్స్‌కు తరలించారు. కొన్ని రోజులపాటు ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. సొంతంగా ఆక్సిజన్ పీల్చుకోవడంతో వెంటిలేటర్‌ను తొలగించి ప్రత్యేక గదికి మార్చారు. అప్పటి నుంచి అతను ఆసుపత్రిలో మంచానికే పరిమితమయ్యాడు. పేరుపెట్టి పిలిచినా కళ్లు తెరిచి చూడలేదు. నోరు విప్పి మాట్లాడలేదు. ఇప్పటివరకు ముక్కు వద్ద అమర్చిన సన్నని గొట్టం ద్వారానే లిక్విడ్ ఆహారం అందిస్తున్నారు. వైద్య సిబ్బంది ఫిజియోథెరపీ చేపడుతున్నారు. అయినా ఆరోగ్య పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. ఎప్పుడు కోలుకుంటాడో వైద్యులు కూడా చెప్పలేని పరిస్థితి. శరీరంలో ఇతర జీవ ప్రక్రియలన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ శ్రీతేజ్ నుంచి స్థిరమైన ప్రతిస్పందనలు ఉండటం లేదని వైద్యులు చెబుతున్నారు.

### ఢిల్లీ ఎన్నికలు.. ఆప్ 'పోర్టల్'.. భాజపా 'పాట'!

ఇంటర్నెట్ డెస్క్: దేశ రాజధాని అసెంబ్లీ ఎన్నికలకు మరికొన్ని గంటలే గడువు ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు మరింత పదునుపెట్టాయి. ఈ క్రమంలో తమ సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి చెందుతున్నామనే విషయాన్ని ఢిల్లీ వాసులు తెలుసుకునేందుకు వీలుగా ఆమ్‌ఆద్మీ పార్టీ ఓ వెబ్ పోర్టల్ ప్రారంభించగా.. అటు భాజపా మరో ప్రచార సాంగ్‌ను విడుదల చేసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఆప్ పోర్టల్..సంక్షేమ పథకాలు అమలే తమ అజెండా అని చెబుతోన్న అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ .. వాటి వల్ల ఒక్కో కుటుంబానికి నెలకు రూ.25వేల ప్రయోజనం పొందుతోందని చెబుతోంది. వీటిని లెక్కించేందుకు పేరుతో ఓ పోర్టల్‌ను కూడా ప్రారంభించింది. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, బస్సుల్లో మహిళలకు ఉచితం తదితర ప్రభుత్వ పథకాల ద్వారా నెలకు ఏమేరకు ఆదా అవుతుందని ఢిల్లీ వాసులు తెలుసుకునేలా దీన్ని రూపొందించింది.

## కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా మోదీ సర్కార్ వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్రం ఎంతో సహాయపడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపిందన్నారు. కేంద్రం వివక్షను ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చేపడుతున్న వివిధ ప్రాజెక్టులకు సాయం చేయాలని పలుసార్లు కేంద్రానికి నివేదికలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. " నిధుల కేటాయింపుల్లో రాష్ట్రానికి ఏటా అన్యాయం జరుగుతోంది. జీడీపీలో రాష్ట్ర వాటా 5 శాతం ఉన్నా తెలంగాణకు ఎప్పుడూ మొండిచేయే. కేంద్రంపై యుద్ధం ప్రకటించి రాష్ట్రానికి నిధులు సాధించాలి. అన్ని పార్టీలు ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. కేంద్రంపై పోరాటానికి భారాస కూడా కలిసి రావాలి" అని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వివక్షతను రాష్ట్ర ప్రజలంతా ఖండించాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, చిన్నారెడ్డి తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

## కులగణన, సామాజిక సర్వేలో 3.50 కోట్ల మంది వివరాలిచ్చారు

మొదటిపేజీ తరువాయి

"స్వాతంత్ర్యం పూర్వం నుంచి మనదేశంలో జనగణన జరుగుతోంది. అసలైన పేదలను గుర్తించేందుకు కులగణన మాత్రం జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులగణన చేయాలని అసెంబ్లీ తీర్మానించింది. బలహీనవర్గాల అభ్యున్నతికి అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేపట్టాం. సామాజిక కులగణన సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. 96.9శాతం (3.50 కోట్ల మంది) మంది సర్వేలో పాల్గొని వివరాలు అందించారు. 3.1శాతం (16లక్షల మంది) వివిధ కారణాల వల్ల వివరాలు అందించలేదు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి ఇతర అంశాలపై సమగ్ర అధ్యయనం జరిగింది. సర్వేను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నించినా.. అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈనెల 4న మంత్రివర్గం ముందు కులగణన సర్వే నివేదిక ప్రవేశపెడతాం. కేబినెట్‌లో చర్చించి వెంటనే శాసనసభలో ప్రవేశ పెడతాం. సమాజంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ముందుకెళ్తోంది" అని మంత్రి ఉత్తమ్ వివరించారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, దామోదర రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### కులగణన సర్వేలోని ముఖ్యాంశాలు...

తెలంగాణలోని 3,54,77,554 మంది వివరాల నమోదు.
మొత్తం 1,12,15,131 కుటుంబాల వివరాలు నమోదు
కులగణన సర్వేలో పాల్గొన్న జనాభా 96.90 శాతం
సర్వేలో పాల్గొనని జనాభా 3.10 శాతం
కులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో ఎస్సీల జనాభా 17.43 శాతం
ఎస్టీల జనాభా 10.45 శాతం
రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతం
ముస్లిం మైనారిటీల బీసీల జనాభా 10.08
ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల జనాభా 56.33 శాతం
ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం
రాష్ట్రంలో మొత్తం ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం
రాష్ట్రంలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం

## యూట్యూబ్ వీడియోలు చూసి.. మోస్ట్ వాంటెడ్ ప్రభాకర్ నేరాలు

మొదటిపేజీ తరువాయి

"చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ పాత నేరస్థుడు. 2022 మార్చిలో విచారణ నిమిత్తం ఏపీలోని అనకాపల్లి కోర్టుకు తీసుకెళ్లిన సమయంలో తప్పించుకుపోయాడు. అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. నిన్న రాత్రి గచ్చిబౌలిలోని ప్రిజం పబ్ దగ్గర ఉన్నాడని తెలుసుకుని పట్టుకునేందుకు వెళ్లిన కానిస్టేబుల్‌పై కాల్పులు జరిపాడు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి కాలికి బుల్లెట్ గాయం అయింది. నిందితుడిని అదుపులోకి తీసుకొని రెండు తుపాకులు, 23 తూటాలు సీజ్ చేశాం. 2013 నుంచి ప్రభాకర్ నేరాలు చేయడం మొదలు పెట్టాడు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 80 కేసుల్లో నిందితుడు. తెలంగాణలో 11, ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసుల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణలో నేరాలకు పాల్పడ్డాడు. ఇళ్లలో చోరీ చేయడం రిస్క్ అని శివార్లలో ఉండే విద్యాలయాల్లో దొంగతనాలు చేస్తున్నాడు. దొంగతనం చేసే ముందు రెక్కీ చేస్తాడు. పోలీసులకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలో యూట్యూబ్‌లో వీడియోలు చూస్తాడు. గతంలో జైల్లో ఉన్నప్పుడు ఓ ఖైదీతో గొడవపడి కక్ష పెంచుకున్నాడు. అతన్ని చంపాలని జైల్లో పరిచయమైన ఖైదీల సహకారంతో బిహార్‌లో గన్ కొనుగోలు చేశాడు. గన్ కొనుగోలు చేయడానికి, నేరాలు చేయడానికి సహకరించిన వారందరినీ అరెస్టు చేస్తాం. ఇప్పటి వరకు ప్రభాకర్ 66 కేసుల్లో అరెస్టయ్యాడు. 8 నెలల క్రితం నుంచి తుపాకులు వాడుతున్నాడు" అని డీసీపీ తెలిపారు.

## ఈనెల 15లోపే పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వానికి పంపించే వీలుంది. కేంద్రం స్పందన ఎలా ఉన్నా... రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి మొదటి వారంలో గ్రామ పంచాయతీల ఎన్నికలకు వెళ్లాలనే కార్యాచరణతో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.

# ప్రజల ఆస్థి పోలీస్ శక్తి నిరంజన్ రెడ్డి


**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

**– వీరుల పుట్టుక ఏరుల పుట్టుక సామాన్యంగా మొదలవుతుంది**

సామాన్య కుటుంబంలో పుట్టిన శ్రీ నిరంజన్ రెడ్డి గారు ఒక శక్తిగా ఎదిగిన తీరుకు ఈ సామెత అచ్చంగా సరిపోతుంది. ఈ తరానికి, యువతకు,విద్యార్థులకు నిరంజన్ రెడ్డి గారి జీవితం ఒక స్పూర్తిగా నిలుస్తుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేముల పల్లి గ్రామంలో శ్రీమతి సుధీష్ణ శ్రీ భగవాన్ రెడ్డి పుణ్య దంపతుల ముగ్గురు మగ సంతానంలో రెండవ వాడు నిరంజన్ రెడ్డి గారు. బాల్యం నుండి చురుకుగా వ్యవహరించే నిరంజన్ రెడ్డి దేశం పట్ల, ధర్మం పట్ల అపార గౌరవం అభిమానం కలిగి ఉండేవారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేములపల్లి గ్రామంలో జన్మించిన నిరంజన్ రెడ్డి మొగుళ్ళ పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్య తో పాటు ఉన్నత విద్య 10 వ తరగతి వరకు చదివారు. నిరంజన్ రెడ్డి గారు సాంకేతిక విద్య ఐటిఐ పెద్దపల్లిలో చదివారు. పెద్దపల్లిలోనే ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ లో చేరాడు. పెద్దపల్లిలో సాంకేతిక విద్యతో పాటు సమాజాన్ని కూడా చదవడం ప్రారంభించారు. కళాశాలను కదన రంగంగా మార్చుతున్న సంఘ వ్యతిరేక శక్తుల, జాతి వ్యతిరేక శక్తుల వల్ల అకారణ ఇబ్బందుల్ని ఎదుర్కొన్నాడు. విద్యా సంస్థల్లో సమాజంలోని అసహజ పరిణామాలను చూస్తూ, గురువుల వద్ద పెద్దల వద్ద అనుమానాలు తీర్చుకుంటూ చదువును వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే సామెతను మించి, "నేటి విద్యార్థులు నేటి పౌరులే" అని నమ్మి తన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. తన కళ్ళెదుట జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలను, అశాంతిని రేపుతున్న సామాజిక శక్తులను అడ్డుకోవడానికి పోలీస్ గా మారాలని ధృఢ నిర్ణయాన్ని తీసుకున్నాడు.

పెద్ద చదువులు చదివి ఫ్యాన్ కింద కూర్చుని చేసే ఉద్యోగాలు కాదని,తనకు తానే సవాల్ విసురుకుని శాంతి భద్రతలు కాపాడే పోలీసు ఉద్యోగం చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. పోలీస్ అంటే భయంతో బతకడం బిడ్డా.. అని తల్లిదండ్రులు సంశయం వ్యక్తం చేసినా కాదని పోలీస్ కానిస్టేబుల్ గా తన వృత్తిగత జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని ప్రారంభించాడు. దేశం కోసం ఇష్టపడి కష్టమైన మార్గంలో నడిచినవాడే మార్గదర్శకుడు అవుతాడని తను నేర్చుకున్న




Dr. JITENDER, IPS.,
DIRECTOR GENERAL OF POLICE
Telangana, Hyderabad.

Ph. Off : 040-23235170
040-23232831
Fax : 040-23296565
e-mail : dgp@tspolice.gov.in

D.O.Letter No.303/Rewards-2/2024,dt:25.01.2025

Dear Sri Niranjan Reddy,

I heartily congratulate you for the "Medal for Meritorious Service (MSM)" conferred on you on the occasion of Republic Day, 2025 i.e. 26.01.2025.

Your dedication and commitment to your duty have been exemplary, and this award is a testament to your hard work and unwavering service. It is a well-deserved recognition of your efforts and contributions.

I trust you will continue to put in the same dedicated service in the future, setting high standards for others to follow.

With best wishes,

Dr Jitender, IPS

To
Sri Anumala Niranjan Reddy,
Circle Inspector of Police,
Metpally Circle Jagtial

ఆశయాన్ని అమలు చెయ్యడానికి పోలీస్ డిపార్ట్ మెంట్ లో చేరాలని నిర్ణయించుకున్నాడు. పోలీస్ కానిస్టేబులు గా ఎంపికై అధికారుల శిక్షణలో తన ప్రతిభను సానబెట్టుకున్నాడు. సమాజ శాంతిభద్రతల రక్షణ మెలుకువలు వంటబట్టిచ్చుకున్న నిరంజన్ రెడ్డి గారికి అధికారులు 1990 సం.లో జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ లో మొదటి పోస్టింగ్ ఇచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న శక్తులకు ఎదురుగా నిలిచి ప్రజల మెప్పు అధికారుల మెప్పు పొందారు. నిరంజన్ రెడ్డి గారి విధుల నిర్వహణతో బెంబేలెత్తిన అరాచక ముఠాలకు నిరంజన్ రెడ్డి కంటగింపుగా మారారు. శాంతి భద్రతలకు సవాలు విసురుతున్న నక్సలైట్లకు కూడా నిరంజన్ రెడ్డి గారు అడ్డుగా కనిపించారు. నిరంజన్ రెడ్డి గారి నిక్కచ్చి విధుల నిర్వహణతో బెంబేలెత్తిన నక్సల్స్ తనని అడ్డు తొలగించడం ఒక్కటే మార్గమని 1992 సం.లో నిరంజన్ రెడ్డి గారి స్వంత ఊరిలో దాడి చేసారు. నక్సల్స్ రెండు దళాలు నిరంజన్ రెడ్డి గారిపై, వెంట ఉన్న తోటి కానిస్టేబుల్ శంకర్ గారిపై కాల్పులు జరిపారు. చాకచక్యంగా ఈ దాడి నుండి తప్పించుకున్న నిరంజన్ రెడ్డి, శంకర్ లకు తీవ్ర గాయాలయ్యాయి. సాహసంగా డ్యూటీ చేస్తూ అధికారులకు అన్ని విధాల సహాయకారిగా ఉన్న నిరంజన్ రెడ్డి గారికి హెడ్ కానిస్టేబుల్ గా ఆగ్జిల్లరీ ప్రమోషన్ ఇచ్చి సిరిసిల్ల పోలీస్ స్టేషన్ లో పోస్టింగ్ ఇచ్చారు. నిరంజన్ రెడ్డి గారి నిబద్ధతను సాహస విధి నిర్వహణ చూసి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 1994లో ముఖ్యమంత్రి సేవా పథకానికి ఎంపిక చేసింది. నిరంజన్ రెడ్డి గారి అంకిత విధి నిర్వహణతో 2000 సం.లో ఏఎస్సై గా, తన సీనియారిటీతో 2012 సం.లో ఎస్సై గా ప్రమోషన్ సాధించి గొల్లపల్లి పోలీస్ స్టేషన్ కు ఎస్సైగా వచ్చారు. విపరీతమైన విధుల ఒత్తిడిలో కూడా నిరంజన్ రెడ్డి గారు సామాజిక బాధ్యతను నిర్వహిస్తూనే ఉన్నారు. తను ఎస్సై గా పనిచేస్తున్న గొల్లపల్లిలో 2013 నుండి 2015 సం. ల మధ్య కాలంలో నవంబర్ 14 బాలల దినోత్సవం పురస్కరించుకొని వేల మంది విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించారు. 2014 సం.లో గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి 12 వేల మందికి వైద్య సేవలందించారు. 2016 సం.లో కథలాపూర్ పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు. కథలాపూర్ లో వైద్యం పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న నకిలీ వైద్యుల భరతం పట్టారు. మహారాష్ట్రలో జీవిత శిక్ష పడి జైలు నుండి తప్పించుకుని తన పరిధిలోని తాండ్రియాల్ గ్రామంలో ఉన్న నేరస్తుడు శ్రీహరిని పట్టుకుని అప్పగించి మహారాష్ట్ర డిజిపి గారి నుండి రివార్డ్ అందుకున్నారు. 2017 నుండి 2018 సం.వరకు జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహించి 2013 సం.లో సిఐ గా ఆగ్జిల్లరీ ప్రమోషన్ పొంది మెట్ పల్లి సర్కిల్ ఇన్స్ పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. నిరంజన్ రెడ్డి గారు తన ఉద్యోగ భాద్యతలు అంకిత భావంతో, క్రమశిక్షణతో నిర్వహించడం తో ఇండియన్ పోలీస్ మెడల్ కు ఎంపిక చేయబడ్డారు. శ్రీ నిరంజన్ రెడ్డి గారి జీవితం విద్యార్థులకు ఆదర్శం. నిరంజన్ రెడ్డి గారి జీవితం యువతకు స్పూర్తి. మహానది కూడా చిన్నగా ఎక్కడో మూలన ఉద్భవిస్తుంది. శివాజీ లాంటి వీరులు కూడా ఎక్కడో మామూలుగా ఉద్భవిస్తారు. మనిషి ఎన్నుకున్న వృత్తి, ఉద్యోగం చిన్నదని చులకన భావం ఉండకూడదని నిరంజన్ గారి జీవితం నేర్పుతున్నది. శాంతి భద్రతలు లేని సమాజం స్మశానంతో సమానం. స్వాతంత్రం మనిషి జన్మ హక్కు అని తిలక్ మహాశయుడు మనకు బోధించాడు. ఆ శాంతి భద్రతలు అందించే పోలీసులు, దేశ రక్షణలోని సైనికులు, అన్ని రక్షక



Indian Police Medal for Meritorious Service
Awarded for valuable service

దళాల లోని ప్రతి వారు ప్రాతః స్మరణీయులు. సగటు మనిషి ఆశించే డబ్బు హోదా పదవులు అందించే ఆనందం కేవలం శాంతియుత సమాజంలోనే లభిస్తాయి. మనం శాంతిగా జీవించడానికి పోలీసులు నిరంతరం పనిచేస్తుంటారు. అల్లకల్లోల దేశాల సమాజంలో జీవితం నరకంగా మారిన తీరు మనం చూస్తున్నాం. ఈ అశాంతి నుండి అరాచక పరిస్థితుల నుండి మనల్ని కాపాడేది రక్షక దళాలే. ఆ రక్షక దళాల్లో పనిచేస్తున్న ప్రతి పోలీస్ కు మనం ఎప్పుడూ కృతజ్ఞులమే. శాంతియుత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడూ భాధ్యతగా మెలగాల్సిందే. సమాజ గమనాన్ని, అసాంఘీక శక్తులను గమనించి ప్రతి వ్యక్తి తన పౌర బాధ్యతలను నిర్వహించాలి. కడుపులో చల్ల కదలకుండా మనం పడుకుంటే, కడుపు మాడ్చుకుని, నిద్రను వదులుకొని పోలీసులు మాత్రమే పనిచేయాలని మనం భావించడం తప్పు. మన చుట్టూ జరుగుతున్న నేరాలు కుట్రలు గమనించి అరికట్టడం లో ప్రతి వ్యక్తి పోలీసులతో కలిసి నడవాలి. ప్రతి పౌరుడూ సివిల్ డ్రెస్ లో ఉన్న పోలీసే. ప్రతి పోలీస్ యూనిఫాం లో ఉన్న పౌరుడే. ప్రతి పోలీస్ మన కుటుంబ సభ్యుడే. నిరంజన్ రెడ్డి గారికి, వారి లాగే నిరంతరం అహరహం పనిచేసే ప్రతి పోలీస్ కు మనం సర్వదా కృతజ్ఞులం. ఇండియన్ పోలీస్ మెడల్ సాధించిన నిరంజన్ రెడ్డి గారిని అభినందిస్తూ తెలంగాణ డిజిపి డాక్టర్ జితేందర్ గారు జనవరి 25 వ తేదీన శుభాకాంక్షలు అందించారు. భారత ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ మెడల్ అందుకున్న శ్రీ నిరంజన్ రెడ్డి గారికి పెద్దఎత్తున ప్రజలు శుభాకాంక్షలు అందించారు. తనను కన్నవారికి, తనను కన్న ఈ నేలకు గర్వకారణంగా ఎదిగిన సిఐ శ్రీ అనుముల నిరంజన్ రెడ్డి గారికి కరపత్రం అభినందనలు,శుభాకాంక్షలు అందిస్తున్నది.

# కోరుట్ల శిశు మందిర్ పూర్వ విద్యార్థుల కలయిక

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

నిన్న ఆదివారం కోరుట్లలో శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాల లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ వేముల ప్రభాకర్ గారి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ కలయిక – 2025 లో పూర్వ విద్యార్థినీ విద్యార్థులు, పూర్వ ఆచార్యులు, పాఠశాల శ్రేయోభిలాషులు మరియు పుర ప్రముఖులు చాలామంది పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన %=ూా% జిల్లా కార్యవాహ, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీ గోల్కొండ నాగరాజు గారు మాట్లాడుతూ శిశు మందిరం పాఠశాలలు సంస్కృతి సంప్రదాయాలకు నెలవని, వీటిలో చదివిన పిల్లలను నిఖార్సైన దేశ



భక్తులుగా తయారు చేస్తూ శిశు మందిరాలు జాతికి ఉత్తమ పౌరులను అందిస్తున్నాయని , ఇలాంటి శిశు మందిరం పాఠశాలల అవసరం నేటి సమాజంలో ఎంతో ఉందని, అందరం




కలిసి పాఠశాలను మరింత అభివృద్ధి పథంలో నడపడానికి తమ వంతుగా కృషి చేయాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో పూర్వ ప్రధానాచార్యులు శ్రీ బండారు కమలాకర్ గారు మరియు ప్రస్తుత ప్రబంధకారిణి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వేముల రవికిరణ్,వనపర్తి చంద్ర మోహన్ మరియు సహ కార్యదర్శి ఎలిమిల్ల మనోజ్ కుమార్, కోశాధికారి మరియు కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్, సభ్యులు అందె శివ ప్రసాద్, కొండ బత్తిని అమర్ నాథ్, శ్రీమతి పాలెపు సాయి దివ్య,మరియు సమితి కార్యదర్శి శ్రీ చెట్ పల్లి శంకర్, సమితి సభ్యులు మంచాల జగన్, ముదిగొండ రాజేశం, పిస్క రమేష్ గారు మరియు ప్రస్తుత ప్రధానాచార్యులు గోపు వెంకటేష్ గారు ఆచార్య బృందం పాల్గొన్నారు.

# సోదరుని వర్ధంతి కి హాజరైన డిప్యూటీ సీఎం

**వైరా కరపత్రం ప్రతినిధి:–**
వైరా లో జరిగిన తన సోదరుడు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు గారి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు. డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు. వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రం వద్ద డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు సమాధిని సందర్శించి పుష్పగుచ్ఛం సమర్పించి నివాళులు అర్పించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం వెంట ఈ కార్యక్రమంలో వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

# శ్రీ రామలింగేశ్వర ఆలయాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం

**వైరా కరపత్రం ప్రతినిది:–**
శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్నానాల లక్ష్మీపురం గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి పనులను ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు....

# మేడిపల్లి అయ్యప్ప ఆలయ ప్రహారీ నిర్మాణ భూమిపూజ

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**
మేడిపల్లి లో నిన్న ఫిబ్రవరి 2 వ తేదీ ఆదివారం అయ్యప్ప ఆలయ నిర్మాణ ప్రహారీ ప్రారంభ భూమిపూజ జరిగింది. మేడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ బొంగోని రాజాగౌడ్ గారు తన స్వంత డబ్బులతో ఈ నిర్మాణ కార్యక్రమాన్ని జరుపుతున్నాడు. కోరుట్ల రోడ్ హైవే కు ఆనుకొని నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ గర్భగుడితో పాటు ఉపాలయాల నిర్మాణం పూర్తి కావచ్చింది. శ్రీ రాజాగౌడ్ గారు గర్భగుడి, ప్రహారీ నిర్మాణం చేయిస్తుండగా ఇతర దాతలు ఎందరో రకరకాలుగా ఆర్థిక తోడ్పాటు నందిస్తున్నారు. అయ్యప్ప స్వామి భక్తుడైన శ్రీ రాజాగౌడ్ గారు ఈరోజు ప్రారంభించిన ఆలయ ప్రహారీ భూమిపూజ కు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ గారు హాజరయ్యారు. ఈ కార్యమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ మాదం వినోద్ గారు, మేడిపల్లి మండల మాజీ జెడ్పీటీసీ శ్రీ కుందారపు జలంధర్ గారు, కోరుట్ల ప్రముఖ న్యాయవాది శ్రీ



బోయిని సత్యనారాయణ గారు, మేడిపల్లి లోని ప్రముఖులు,నాయకులు,వ్యాపారులతో పాటు మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్ లు ఎంపీటీసీ లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు నాయకులు, ఇతర అన్ని పార్టీల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఈ ప్రహారీ నిర్మాణానికి ఆది శ్రీనివాస్ గారితో పాటు బోయిని సత్యనారాయణ, ఇతర ప్రముఖులు కొబ్బరి కాయలు కొట్టి పనులు ప్రారంభించారు. రాజాగౌడ్ గారి ఔదార్యాన్ని ఎమ్మెల్యే



ఆది శ్రీనివాస్ గారు, బోయిని సత్యనారాయణ, కుందారపు జలంధర్ గారు ప్రశంసించారు.

# నేలకొండపల్లి మండల కేంద్రంలో ఘనంగా భక్తరామదాసు జయంతి ఉత్సవాలు..

**ఖమ్మం కరపత్రం ప్రతినిధి:–**
ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండల కేంద్రంలో భక్త రామదాసు 392 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి యువత పాల్గొని భక్త రామదాసు గారి విగ్రహానికి పూలమాలవేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు జెర్రిపోతుల అంజనీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రామదాసు ఎన్నో కష్టాలకు ఓర్చి భద్రాచలం లో రాముడికి ఆలయం నిర్మించాడన్నారు. ఆయన నడయాడిన నేలమీద జన్మించడం పూర్వజన్మ సుకృతం అని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు సోమన బోయిన సాయి నవీన్,నవిలి వీరబాబు,మాదాసు ఆదం ,sk సొందు,కామర్లపూడి అయ్యప్ప,మందడపు పృథ్వి,రాచకొండ అయ్యప్ప, జెర్రిపోతుల బాబి,పగిళ్ల సాయి,గుడెల్లి చంద్రకాంత్,గుడెల్లి నాని,వేముల సాయి,వేముల ధనమూర్తి,బండి గోపి,పగిడి కత్తుల రఘు తదితరులు పాల్గొన్నారు..

## బస్వేశర విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల



**కరపత్రం బాన్సువాడ ఫిబ్రవరి 2**
బాన్సువాడ మండలంలోని ఇబ్రహింపేట్ గ్రామంలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న బసవేశ్వర విగ్రహ ఏర్పాటుకు ఆదివారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వర మహారాజ్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన అడుగుజాడల్లో నడిచినప్పుడే మనము ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఉద్దేర హన్మాండ్లు, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, హన్మాండ్లు సార్, నారాయణరెడ్డి, గంగాధర్, శంభు లింగం, దేవేందర్, పరమేశ్వర్, లింగం, లింగయత్ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## పరివార్ రెస్టారెంట్ ను ప్రారంభించిన కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు



**కరపత్రం బాన్సువాడ ఫిబ్రవరి 2**
బాన్సువాడ పట్టణంలో ఆర్టీసీ బస్ డిపో సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదివారం పరివార్ రెస్టారెంట్ ను ఆదివారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన వంటకాలను అందించి వారి అభిమానాన్ని చురగోనలని నిర్వాహకులకు ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఖలేక్, కృష్ణారెడ్డి, కాసుల రోహిత్,నార్ల సురేష్ గుప్తా, మాజీ జడ్పీటిసి ప్రదీప్ పటేల్, ఏజస్, రెంజర్ల సాయిలు, శాంతాపూర్ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, మాసాని రవీందర్ రెడ్డి, మాసాని అశోక్ రెడ్డి, బాలు,నిర్వాహకులు కాజా,తదితరులు పాల్గొన్నారు

## జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సన్ వే విద్యార్థిని శరణ్య

**కరపత్రం బీర్కూర్ ఫిబ్రవరి 2**
బీర్కూరు మండల కేంద్రంలోని సన్ వే పాఠశాలకు చెందిన విద్యార్థిని శరణ్య



ఆదివారం హైదరాబాద్ లోని విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ రాష్ట్రస్థాయి పోటీలలో సీనియర్ లెవెల్ కేటగిరి 5లో పాఠశాలకు చెందిన విద్యార్థిని శరణ్య ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నాగ పరమేశ్వరరావు, కరస్పాండెంట్ శేఖర్ యాదవ్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సీఈఓ హరిచంద్, డైరెక్టర్ సతీష్, వినాయక్, పాఠశాల ప్రిన్సిపల్ నాగ పరమేశ్వరరావు, కరస్పాండెంట్ శేఖర్ యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా జైలుకు జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా రాక

**కరపత్రం,నిజామాబాద్ టౌన్,ఫిబ్రవరి 02 :**
నిజామాబాద్ జిల్లా కేంద్ర కారగారంకు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డా.సౌమ్య మిశ్రా రానున్నారు.నిజామాబాద్ జిల్లా జైలులో సోమవారం వివింగ్ యూనిట్ ప్రారంభానికి డిజి వస్తున్నట్లు తెలిసింది.నిజామాబాద్ జిల్లా జైలు సంధర్శనతో పాటు వివింగ్ యూనిట్ ప్రారంభ వేడుకలలో జైళ్ళ శాఖ వరంగల్ రేంజ్ డిఐజి సంపత్ తో పాటు నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సింధూశర్మలు,ఇతర అధికారులు పాల్గొనున్నారు.



## ఈనెల 6న జరిగే పాలేరు నియోజకవర్గ యాదవుల విస్తృత స్థాయి సమావేశమును జయప్రదం చేయండి

**ఖమ్మం కరపత్రం ప్రతినిధి:-**

**కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు**

అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 6 వ తారీఖున ఎస్ ఆర్ బ్రదర్స్ ఫంక్షన్ హాల్, కూసుమంచిలో పాలేరు నియోజకవర్గం స్థాయి యాదవులు, గొర్రెల పెంపకం దారుల సమావేశం జరుగుతుందని, యాదవుల,గొర్రెల పెంపకం దారుల సమస్యల పరిష్కారం కొరకు జరిగే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లి బాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పిలుపునిచ్చారు.

ఈరోజు ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరిలో పాలేరు నియోజకవర్గ స్థాయి యాదవుల విస్తృత స్థాయి సమావేశము కొరకు కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం అఖిల భారత యాదవ మహాసభ నాయకులు మాట్లాడుతూ

ఏ పార్టీ అయినా అధికారంలోకి రాకముందు యాదవులకు అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుంటున్నారే తప్ప యాదవులకు ఎప్పుడు న్యాయం చేయలేదని, యాదవుల కులవృత్తి అయిన



గొర్రెల పెంపకం ను అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చి, చివరికి మోసం చేస్తున్నారని మనం వాటిని భరించటం మనకు అలవాటైందని ముఖ్యంగా యాదవులు ఐక్యంగా నిలబడి సమస్యలకు పోరాటం చేయకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణం అని పేర్కొన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల లో యాదవులకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా గొర్రెల పెంపకం దారులకు న్యాయం చేయాలని, చేయని పక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఐక్యంగా సమస్యలపై యుద్ధాన్ని చేస్తామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొరిమేకల నాగేశ్వరరావు, సోమనబోయిన లింగయ్య మారుతీ ఎట్టయ్య, పొదిలా సతీష్,గోనె వెంకటనారాయణ గజ్జి సూర్య నారాయణ, మెండెం వెంకటేశు గొల్లన వీరభద్రం, నాగన బోయిన నాగరాజు, మాలెపు కృష్ణయ్య, బుర్ర రాధాకృష్ణ, కాశయ్య బొల్లినేని నాగేశ్వరరావు, బట్టు మధు, మాగంటి చందర్ రావు, మాగంటి కేశవరావు అశోక్ తదితరులు పాల్గొన్నారు....

## అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా ఘన విజయం పట్ల మాజీ ఎంపీ నామ హర్షం

### - గొంగిడి త్రిష ప్రతిభ తెలంగాణకు గర్వ కారణం - మాజీ ఎంపీ నామ



**ఖమ్మం కరపత్రం ప్రతినిధి:-**
అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమిండియా అద్భుతమైన విజయాన్ని సాధించడం పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. భారత్ యువ క్రికెటర్లు ప్రదర్శించిన అసాధారణ ప్రతిభ, క్రీడాస్ఫూర్తి దేశానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో




ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలం వాసి గొంగిడి త్రిష అద్భుతంగా రాణించిందని, ఫైనల్ మ్యాచ్ లో 3 వికెట్స్ తీయడం తో పాటు 44 పరుగులు చేసిన ఆమె ప్రదర్శన మన తెలంగాణకు గర్వకారణమని నామ నాగేశ్వరరావు ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, అంతర్జాతీయ స్థాయిలో భారత మహిళా క్రికెట్‌ను మరింత ఎదిగించేందుకు త్రిష వంటి యువ క్రీడాకారిణులు ప్రేరణగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. భారత యువ మహిళా జట్టు వరుసగా రెండోసారి అండర్-19 వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకోవడం యువ క్రీడాకారిణుల అంకితభావం, కోచింగ్ స్టాఫ్ కృషి, బీసీసీఐ సహాయ సహకారాలు ప్రశంసనీయమని నామ పేర్కొన్నారు. ఈ ఘన విజయం భారత క్రికెట్ అభివృద్ధిలో మైలురాయిగా నిలిచిపోతుందని, మహిళా క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు మరింతగా ముందుకు రావాలని సూచించారు. యువ క్రీడాకారిణులకు మెరుగైన వనరులు, శిక్షణ అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు...

## దివ్యాంగులు ఆర్థిక బలోపేతమైనప్పుడే నిజమైన అభివృద్ధి.

**తిరుమలాయపాలెం మన వెలుగు ప్రతినిధి:-**
తిరుమలాయపాలెం మండల పిండిప్రోలు ఎంఎల్ పార్టీ కార్యాలయం భవనంలోని మండలానికి చెందిన దివ్యాంగులకు SRDS ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు స్వయం ఉపాధి శిక్షణ పై అవగాహన సదస్సు మరియు మార్గదర్శక సూచకాలను సమావేశం నిర్వహించారని సంస్థ ప్రతినిధి గడ్డం రాంబాబు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమ్మకొమ్మటి నాగేశ్వరరావు గారు CPI ML మాస్ లైన్ ప్రజా పంద పార్టీ ఖమ్మం జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడుతూ మండలంలోని దివ్యాంగులందరూ ఆర్థికంగా బలోపేతం అవ్వాలని అందుకు మా యొక్క సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు నేను ప్రత్యేకంగా దివ్యాంగులకు వారి సమస్యలు పరిష్కారానికి ప్రథమ స్థానాన్ని ఇస్తామన్నారు దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతం అవ్వడానికి మా వంతు కృషి మేము







చేస్తాము అన్నారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండలం వికలాంగుల అధ్యక్షులు దైద వినోద్ గారు పాల్గొని మాట్లాడుతూ దివ్యాంగులకు సొంతంగా వ్యాపారాలు చేసుకొనుటకు నైపుణ్య శిక్షణ ఇచ్చి దివ్యాంగులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడే విధంగా కృషి చేయడం చాలా సంతోషకరమైన విషయం దానికి మా మండలంలో ఉన్న వారికి అవకాశం రావడం మేము అదృష్టంగా భావిస్తుంది ఈ యొక్క అవకాశాన్ని దివ్యాంగులందరూ ఉపయోగించుకోవాలని కోరారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో SBI RSETI సీనియర్ ఫ్యాకల్టీ వహీద్ పాషా గారు అర్హత కలిగిన 35 మంది నీ ఎంపిక చేసి SBI RSETI ద్వారా పది రోజులు వ్యాపార అభివృద్ధి నైపుణ్యత పై శిక్షణ ఇవ్వబడుతుందని అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తామని తెలిపారు మండలానికి చెందిన దివ్యాంగులు సుమారు 60 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆర్ డి ఎస్ ప్రతినిధి ధరావత్ జానకి సాయి కిరణ్ మరియు తెలిపారు ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు సైదాబీ, మాధవి, మరియు దివ్యాంగులు పాల్గొన్నారు...

## వద్దిరాజు ఇంట కళ్యాణోత్సవం

**మహబూబూబాబాద్ కరపత్రం ప్రతినిధి:-**
రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తమ్ముడు-మరదలు వద్దిరాజు పెద్ద వెంకన్న-పద్మావతిల ఏకైక కుమార్తె అఖిలాండేశ్వరి పెళ్లి ప్రణవం ఆర్.శ్రీనివాస్-శ్రీలతల ప్రథమ పుత్రుడు కైలాశ్ తో అంగరంగ వైభవంగా జరిగింది.మహబూబాబాద్ పట్టణంలోని పీఎస్ఆర్ ఏసీ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఉదయం జరిగిన ఈ పెళ్లికి వద్దిరాజు వంశస్తులు,వారి బంధుగణం, ప్రముఖులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు,మాజీ ఎంపీ మాలోతు కవిత,ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్,కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంటా సంజీవరెడ్డి,సింగిల్ విండో ఛైర్మన్ మర్రి రంగారావు, బీఆర్ఎస్ నాయకులు పరకాల శ్రీనివాస్ రెడ్డి,ముత్యం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్,అల్లం నాగేశ్వరరావు,రావుల మురళి,కూరెల్లి సతీష్,వేముల శ్రీనివాస్ రెడ్డి,కేసముద్రం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మామిడి అశోక్, మహబూబాబాద్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ యాళ్ల మురళీధర్ రెడ్డిలు అక్షింతలు వేసి నూతన వధూవరులు అఖిలాండేశ్వరి-కైలాశ్ లకు తమ ఆశీస్సులు అందజేశారు.వద్దిరాజు పెద్ద వెంకన్న మాతృమూర్తి కమలమ్మ,సమీప బంధువు గంగుల సుధాకర్,అన్నలు-వదినెలు వద్దిరాజు కిషన్-శశిరేఖ, వద్దిరాజు దేవేందర్-ఇందిర, వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మీ, వద్దిరాజు మోహన్ -వాసవి, తమ్ముడు-మరదలు వద్దిరాజు వెంకటేశ్వర్లు-ఉమా మహేశ్వరి,అక్క సంగిశెట్టి పద్మ,అక్క-బావ శీలం లక్ష్మీ-సత్యనారాయణ, జర్నలిస్టుల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణలు అక్షింతలు వేసి నూతన వధూవరులు అఖిలాండేశ్వరి-కైలాశ్ లను ఆశీర్వదించారు.అఖిలాండేశ్వరి అన్నలు-వదినెలు వద్దిరాజు శ్రీనివాస్,వద్దిరాజు నిఖిల్ చంద్ర-అనీల, వద్దిరాజు నాగరాజు-డాక్టర్ అర్చిత,అక్కలు-బావలు సునీత-డాక్టర్ జే.ఏన్.వెంకట్,మాధవి-విజయ్,అక్క డాక్టర్ గంగుల గంగాభవానిలు అక్షింతలు వేసి ఆమెతో పాటు వరుడు కైలాశ్ ను ఆశీర్వదించారు.అలాగే,వద్దిరాజు ధీరజ్,వద్దిరాజు ప్రీతమ్, వద్దిరాజు గిరినందన్, డాక్టర్ జే.ఏన్.వెంకట్ కుమారుడు విశ్వంత్ లు నూతన వధూవరులు అఖిలాండేశ్వరి-కైలాశ్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.ప్రముఖ న్యాయవాదులు బర్మా చక్రపాణి,ఊసా రఘు, చెరుకూరి శేషగిరిరావు,మున్నూరుకాపు ప్రముఖులు పారా నాగేశ్వర్ రావు,ఆర్జేసీ కృష్ణ,నాడెం శాంతికుమార్,తోట రామారావు,రాపర్తి రాజా,నానబాల హరీష్ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఎంపీ రవిచంద్ర అనుచరులు దాసరి రాహుల్ నాయుడు, బోయిన కార్తీక్,మద్దెల భానుప్రతాప్,బుల్లోజు నరేంద్రాచారి, ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు నూతన వధూవరులు అఖిలాండేశ్వరి-కైలాశ్ లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు...